క్లుప్తంగా

కార్మికుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్మికులకు దుస్తులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని, కార్మికులపై కమిషనర్ వేధింపులను ఆపాలని, 2018 నుంచి 2023 వరకూ కార్మికుల డీఏ బకాయిల వివరాలను తెలియజేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందజేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు నరసయ్య, జగదీష్, ఈశ్వరయ్య, వాసు, నరసయ్య, చిన్నా పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురానికి చెందిన ధరణి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల వివరాలు మేరకు.. యర్రగుంట్ల గ్రామానికి చెందిన ధరణికి ముకుందాపురానికి చెందిన ధనుంజయతో వివాహం జరిగింది. కుటుంబ కలహాలు వల్ల గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ధరణి పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉండగా వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను 108లో చికిత్స నిమిత్తం అనంతపురంలో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



అనాథ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మదర్‌థెరిస్సా మిషనరీస్ ఆఫ్ చారిటీస్ ఆశ్రమంలో ఉంటూ బుధ, గురువారం అనారోగ్యంతో మృతి చెందిన అనాథలు సుందరి, రామాంజనమ్మ మృతదేహాలకు ఆ నలుగురు సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. చారిటీస్ ప్రతినిధుల సమాచారం మేరకు గురువారం అనాధ మృతదేహాలను ఆలూరురోడ్‌లోని హిందూ శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ సందర్భంగా ఆ నలుగురు సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, కోశాధికారి ప్రదీప్ ఆచారి, ఆటో వేణుకు చారిటీ సిస్టర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

స్కూల్ బస్సులు సీజ్ చేయాలి

గుంతకల్లుటౌన్: కండీషన్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేసి, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబును ఏబీవీపీ నాయకులు కోరారు. గురువారం ఎంవీఐను ఏబీవీపీ భాగ్ కన్వీనర్ వివరాజ్, ఉపాధ్యక్షుడు వసీమ్ ఖాన్ తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని పలు స్కూళ్ల బస్సులు కండీషన్‌లో లేవని, రెండు రోజుల క్రితం ఓ స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిలై ప్రమాదం తప్పిందన్నారు. కండీషన్ లేని బస్సులను సీజ్ చేయాలని వారు విన్నవించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టిన దుండగులు

తాడిపత్రి రూరల్: మండలంలోని బొందలదిన్నె గ్రామ సమీపంలోని పొలంలో గురువారం తెల్లవారుజామున దుండగులు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి.. అందులోని ఆయిల్, రాగి వైరును అపహరించారని పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన సత్యనారాయణకు బొందలదిన్నెలో పొలం ఉంది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోవడాన్ని గమనించిన స్థానికులు సత్యనారాయణకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే పొలం వద్దకు వచ్చిన సత్యనారాయణకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని ఆయిల్, రాగివైరును దొంగిలించుకొని పోయారని గుర్తించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

శింగనమల: శింగనమల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మలు ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

తాడిపత్రిలో భయం.. భయం!





- ఈ చిత్రంలో గాయపడిన వ్యక్తి పేరు నాగేంద్ర. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. డిసెంబర్ 7న పట్టణంలోని క్రిష్టాపురం జీరోరోడ్డులో కొంతమంది పోకిరీలు మహిళలను అల్లరి చేస్తుండగా సహచర భవన నిర్మాణ కార్మికులతో కలసి అడ్డుకోబోయాడు. వెంటనే ఆ పోకిరీలు మరో గ్యాంగ్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేశారు. దీంతో క్షణాలపై అక్కడి చేరుకున్న మరో గ్యాంగ్ భవన నిర్మాణ కార్మికులపై రాళ్లతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శంకర్, నాగేంద్ర మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉంది.

- హద్దుమీరుతున్న రౌడీల అగడాలు
- గ్యాంగ్‌లను కాపాడుతున్న కొందరు నాయకులు
- పట్టించుకోని పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడిపత్రిలో చీకటి పడితే చాలు ప్రజలు రోడ్ల మీదికి రావాలంటేనే జంకుతున్నారు. కారణం.. పట్టణంలో రోజురోజుకూ కొందరు రౌడీల ఆగడాలు హద్దు మీరుతుండడమే. ఎప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయంతో ప్రజలు ప్రాణాలను అరచేత పట్టుకుని రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉండేవి. అప్పట్లో ప్రభుత్వం పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. అందుకు ఉదాహరణ ఇటీవల తాడిపత్రి పట్టణంలోని క్రిష్టాపురం జీరో రోడ్డులో జరిగిన ఘటనే అందుకు నిదర్శనం. కొందరు ఆకతాయిలు మహిళలను ర్యాగింగ్ చేస్తుండడంతో అడ్డుచెప్పబోయిన భవన నిర్మాణ కార్మికులపై ఆకతాయిల గ్యాంగ్ విరుచుకుపడింది. ఈ దాడిలో శంకర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా నాగేంద్ర అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. అలాగే పట్టణంలో గంజాయి బ్యాచ్ విచ్చలవిడిగా బైకులపై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ అడ్డొచ్చిన వారిని గుద్దేస్తూ నానా వీరంగం సృష్టిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. మద్యం మత్తులో రాత్రి పూట ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలకు నిప్పంటించి భీభత్సం సృష్టిస్తున్నారు. పట్టణంలో పోకిరీల ఆగడాలు హద్దు మీరుతున్నా వాటిని అరికట్టేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టడంలేదు. ఘటనలు జరిగిన తరువాత



గంజాయి బ్యాచ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి(ఫైల్)

కేసులు నమోదు చేసి, అరెస్టులు చూపించి చేతులు దులుపుకుంటున్న పోలీసులు పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గంజాయి గ్యాంగ్‌ల ఘర్షణలు

చీకటి పడితే చాలు పోకిరీలు మద్యం, గంజాయి సేవించి వీధుల్లో హల్‌చల్ చేస్తూ దారిలో పోయే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. పట్టణంలోని క్రిష్టాపురం జీరో రోడ్డు, ఐదో రోడ్డు, యల్లనూరు రోడ్డు, కాలువ గడ్డ వీధి, మెయిన్‌బజార్, విజయనగర్‌కాలనీ, అంబేద్కర్‌నగర్, శ్రీరాములపేట, సుంకులమ్మపాలెం, పోరాటకాలనీ, సీపీఐ కాలనీ, నందలపాడు, శ్రీనివాసపురం తదితర కాలనీల్లో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు.

రోడ్లపై బైక్ రేసులు

పట్టణంలో కొందరు పోకిరీలు బైక్ రేసులతో రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు. మరి కొందరు ప్రమాదకరమైన స్టంట్లు చేస్తున్నారు. ఈ స్టంట్లకు క్రిష్టాపురం జీరో రోడ్డు, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు, సంజీవనగర్ జీరో రోడ్డు, మొదటి రోడ్డు, మెయిన్ బజార్, శ్రీరాముల పేట ప్రాంతాలు వేదికగా మారాయి. రోడ్లపై 90 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నారు. ట్రిబుల్ రైడింగ్‌తో బైక్‌లకు సైలెన్సర్లు తీసి పెద్ద పెద్ద సౌండ్ చేస్తూ నానా ఫీట్లు చేస్తూ ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. వీరి చేష్టలతో రోడ్డున పోయే పాదాచారులు, వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి 9గంటలు దాటిన తరువాత ఈ గ్యాంగ్‌లు వాకింగ్ వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.

పోకిరీలకు అడ్డాగా కాఫీ కేఫ్‌లు

పట్టణంలోని కొన్ని కాఫీ కేఫ్‌లు పోకిరీలకు అడ్డాగా మారాయి. గ్యాంగ్‌లన్నీ కేఫ్‌ల వద్ద నడిరోడ్లలో బైకులు పార్కింగ్ చేసి అక్కడే కాఫీ, టీ తాగుతూ సిగరెట్లు కాల్చుతూ దారి వెంట వచ్చి పోయే మహిళలను ర్యాగింగ్ చేస్తున్నారు. మరి కొందరు కాఫీ కేఫ్‌లను అడ్డాలుగా చేసుకుని అక్కడే మద్యం, గంజాయి సేవిస్తూ ఘర్షణలకు దిగుతున్నారు.

కానరాని విజిబుల్ పోలీసింగ్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జిల్లా ఎస్పీలు జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పటికప్పుడు నేరాలను కట్టడి చేసే అవకాశముంటుంది. కానీ ప్రస్తుతం ఆ విజిబుల్ పోలిసింగ్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కనిపించడంలేదు. పోలీసులు కేవలం పోలీస్ స్టేషన్‌కు మాత్రమే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆకతాయిలకు అండగా నాయకులు

ఆకతాయిలకు కొందరు నాయకులు అండగా ఉంటూ వారికి ఏ ఆపద వచ్చిన వారికి బాసటగా నిలుస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసులు లేకుండా పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం, ఒక వేళ కేసులు నమోదు చేయాల్సి వస్తే నామ మాత్రపు కేసులు నమోదు చేసేలా తమ పలుకుబడిని ఉపయోగించి ఆకతాయిలను వెనకేసుకొస్తున్నారు. దీంతో తాము ఏమి చేసినా చెల్లుతుందన్న ధీమాతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో శాంతిభద్రతలకు పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాంతిభద్రతలకు పెద్దపీట వేసింది. అప్పటి పోలీసులు శాంతిభద్రతల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమర్థవంతమైన పోలీసు అధికారి వస్తే తప్పా పట్టణంలో శాంతిభద్రతలు అదుపులోకి రావని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. పోలీసులు కేవలం పోలీస్ స్టేషన్‌కే పరిమితం కాకుండా వీధుల్లో పెట్రోలింగ్ చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. కాఫీ కేఫ్‌లు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం పోలీసులు గస్తీ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది

తాడిపత్రిలో ఇటీవల కొన్ని ఘటనలు

- నవంబర్ 9: పాత కూరగాయల మార్కెట్ వద్ద గ్యాంబ్లింగ్ లో వచ్చే ఆదాయం పంపకాల విషయంలో ఇరు వర్గాల వారు ఘర్షణలకు దిగినా పోలీసులు కేసు నమోదు చేయలేదు.
- నవంబర్ 10: క్రిష్టాపురం ఐదో రోడ్డులో గంజాయి సేవించిన యువకులు బైక్‌లపై తిరుగుతూ నానా హంగామా చేసి కాలనీ వాసులను భయ భ్రాంతులకు గురి చేశారు. ప్రశ్నించిన కాలనీ వాసులపై దాడులకు దిగి ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనపై అప్పట్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- నవంబర్ 12: ఓ ప్రైవేటు కళాశాలలో నీరు తాగే విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వివాదంలో బయటి వ్యక్తులు వచ్చి కట్టెలు, రాళ్లతో విద్యార్థి బంధువులపై దాడికి దిగారు. ఈ దాడిలో రంగనాయకులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.
- డిసెంబర్ 1: గంజాయి బ్యాచ్ ప్రభోదాశ్రమానికి చెందిన జేసీబీ అద్దాలు ధ్వంసం చేసింది.

విద్యుత్ పొదుపు.. ప్రగతికి మలుపు



గుంతకల్లుటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు



తాడిపత్రి అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

గుంతకల్లుటౌన్/తాడిపత్రిఅర్బన్/తాడిపత్రి టౌన్/గుత్తి: ఇంధన వనరులను పొదుపుగా, సమర్థంగా వాడుకోవాలనిని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు పట్ల అవగాహన కల్పించేందుకు గురువారం గుంతకల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కరెంట్‌ను ఆదా చేసి భావితరాలకు భరోసానివ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికారులు గుర్తు చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఏఓ యుగంధర్‌నాయుడు, ఏఈలు రవిచంద్ర, రఘునాథ్, విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో విద్యుత్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈఈ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సోలార్ ఇంధన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహమిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఏఓ నరసప్ప, డీ1 ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈ2 ఏఈ వీరాంజనేయరెడ్డి, రూరల్ ఏఈ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా తాడిపత్రి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా ట్రాన్స్‌కో అధికారులు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈఈ ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ ఇంజనీరు శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు. గుత్తిలో నిర్వహించిన ర్యాలీలో డీఈఈ రాజశేఖర్, ఏడీఈ సాయి శంకర్, పామిడి, పెద్దవడుగూరు ఏఈలు మధుసూదన్‌రావు, షఫి, లైన్ ఇన్‌స్పెక్టర్లు నాగేంద్ర ప్రసాద్, ప్రహ్లాద, సూర్యనారాయణ, కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తిలో విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యాజమాన్య పద్ధతులు పాటించండి

గుత్తి రూరల్/గుంతకల్లు రూరల్: మామిడి మొక్కలకు ఎరువులు వేసే సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. గుత్తి మండలంలోని ఊటకల్లు గ్రామంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించి మామిడిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారు మాట్లాడుతూ మామిడి పూత వచ్చే సమయంలో తేనె మంచు పురుగు ఆశిస్తుందన్నారు. వాటి నివారణకు మోనోక్రోటోఫాస్1:6 ఎంఎల్ లేదా డైమిటిడ్ 2 ఎంఎల్ లేదా హస్పిట్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సరైన సమయంలో పూత రాకపోతే పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో మిరపలో అధిక దిగుబడులు సమగ్ర సస్యరక్షణతోనే మిరప పంటలో అధిక దిగుబడులు సాధ్యమని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే.రామసుబ్బయ్య రైతులకు సూచించారు. గురువారం ఆయన హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవితో కలసి గుంతకల్లు మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో పర్యటించారు. రైతులు సాగు చేసిన మిరప పంటను పరిశీలించి, పంటసాగులో తీసుకోవాల్సిన మెలకువలు, వాడాల్సిన ఎరువులు, క్రిమి సంహారక మందులపై అవగాహన కల్పించారు. మిరప పంట ప్రస్తుతం కాయ దశలో ఉన్న నేపథ్యంలో రైతులు పైపాటుగా యూరియా, పొటాషియం ఎరువులు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. రసం పీల్చే పురుగు నివారణ, నల్లి తెగులు నివారణకు వాడాల్సిన మందులను వివరించారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

గుంతకల్లుటౌన్/పామిడి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేసి, దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి జగ్గిలి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం గుంతకల్లులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన షా ను కేబినెట్ నుంచి తొలగించకపోతే ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు భీమలింగ, ఆదినారాయణ, జెన్నే మస్తాన్, కుళ్లాయప్ప, వెంకటేష్, మొలక రామాంజనేయులు, మల్లికార్జున, మద్దిలేటి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలోని టీసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. లేకుంటే విద్యార్థులు, దళిత సంఘాలతో కలసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.



గుంతకల్లులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు



పామిడిలో మాట్లాడుతున్న హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్

చదువు, క్రీడలు రెండు కళ్లులాంటివి

గుత్తి: విద్యార్థులకు చదువు, క్రీడలు రెండు కళ్ల లాంటివని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అన్నారు. గుత్తిలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం స్పోర్ట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మల్కీ సాబ్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కమిషనర్ మాట్లాడారు. చదువు మానసిక ప్రశాంతతను ఇస్తే, క్రీడలు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. యోగా మాస్టర్లు కృష్ణ, రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా తదితరులు

భూ సమస్యలు పరిష్కరిస్తాం

శింగనమల/పెద్దవడుగూరు/గుంతకలు రూరల్/గుత్తి రూరల్/పామిడి: భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం శింగనమలలోని రామాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంకలు, వాగులు, ఫారెస్ట్ భూములు, దేవాలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, సర్పంచ్ నాగమునెమ్మ, వైస్ ఎంపీపీ విజయ, మండల సర్వేయర్ వరకుమార్, సర్వేయర్ పవన్‌కుమార్ , వీఆర్వో, రైతులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని దిమ్మగుడి, కండ్లగూడూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఆర్ఐ లహరిక, సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లు మండలంలోని దంచర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలను అందాయని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. గుత్తి పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా 12 మంది రైతులు ఫిర్యాదులందజేశారు. తహసీల్దార్ ఓబులేసు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, వీఆర్‌ఓలు సురేంద్ర, నాగరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని అక్కజాంపల్లి, ఎదురూరు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీడీఓ తేజోత్స్న, సర్వేయర్ మురళీధర్, ఈఓ క్రిష్ణయ్య, రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

విద్యార్థి విభాగం నాయకుడికి పరామర్శ





మనోజ్‌కాశిని పరామర్శిస్తున్న రమేష్‌రెడ్డి, పేరం స్వర్ణలత

తాడిపత్రిటౌన్: టీడీపీ నాయకుల దాడిలో గాయపడి చికిత్స తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం టౌన్ ప్రెసిడెంట్ మనోజ్‌కాశిని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత, ఉపాధి హామీ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మేమనాథరెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు ఓబులరెడ్డి తదితరులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు సూచించారు. అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

రేపు మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

గుంతకల్లుటౌన్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా శనివారం పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కటింగ్ అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేయడంతోపాటు అనాథ బాలుర, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణ, మండలానికి చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటింటి సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుత్తి రూరల్: గ్రామాల్లో ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పామిడి, గుత్తి, పెద్దవడుగూరు, యాడికి మండలాల్లోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో మిస్సింగ్ సిటిజన్ సర్వీసెస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సిబ్బంది వెళ్లి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ప్రభుత్వ ఇచ్చిన జాబితా ప్రకారం విద్యార్హత, వృత్తి, జెండర్, ఇతర వివరాలను నమోదు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు కార్యక్రమంలో ఎంపీడీఓలు ప్రభాకర్(గుత్తి), తేజోష్న(పామిడి), నరశింహారెడ్డి(యాడికి), గుత్తి మునిసిపల్ కమిషనర్ జబ్బార్ మియా పాల్గొన్నారు.

నివాళి

తాడిపత్రి అర్బన్: మండల విశ్రాంత విద్యాధికారి సుబ్బయ్యనాయుడు మృతికి పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. గురువారం సుబ్బయ్య నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'బాధితులకు న్యాయం చేయాలి'

తాడిపత్రిటౌన్: యాడికి మండలంలోని సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలని వామపక్ష నాయకులు గురువారం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ఆసుపత్రి వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సాయిప్రదీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఘటనపై ఎక్సైజ్ సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కార్యక్రమంలో అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు అధికారులు, ఎక్సైజ్ ఎస్ఐలు అస్లాన్ బేగ్, గోపాల్ , హెడ్ కానిస్టేబుల్ విజయ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

23న 'ప్రజా వేదిక'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు 17వ విడత సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది హాజరు కావాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

గుత్తి రూరల్: ఉపాధి హామీ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి తప్పకుండా పనులు కల్పించాలన్నారు. పాత పనులకు బిల్లులు చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. త్వరలో జరిగే సామాజిక తనిఖీలకు వచ్చే అధికారులకు ఉపాధి సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఈసీ చెన్నారెడ్డి, టీసీలు లోకేష్, మల్లికార్జున, ఎఫ్ఏలు నరశింహులు, కోన లక్ష్మణరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722,
9010588846, 9010223701